క్లుప్తంగా

అర్ధనారీశ్వరస్వామికి పూజలు



అన్నదానం చేస్తున్న పవిత్రారెడ్డి దంపతులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి, అల్లుడు కౌశిక్‌రెడ్డి మొదటి వివాహ మహోత్సవం సందర్భంగా సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి పట్టణ శివారులోని అర్ధనారీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. అనంతరం బియ్యపు శ్రీవాణిరెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అంజూరు తారక శ్రీనివాసులు, పగడాల రాజు, సిరాజ్‌బాషా, శరవణకుమార్, సురేష్, వేణురెడ్డి పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటు

ఏర్పేడు: మండలంలోని ప్రజల సౌకర్యార్థం సోమవారం ఏర్పేడు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఆ కేంద్రాన్ని మండల ఈవోపీఆర్‌డీ రమణకుమార్ పరిశీలించారు. మండల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, బయోమెట్రిక్ అప్‌డేషన్ వంటి ప్రక్రియలను చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

ఓట్లను బీజేపీ చోరీ చేసింది

శ్రీకాళహస్తి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం ఓట్లను చోరీ చేశాయని కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తెయ్యనాయుడు ఆరోపించారు. ఆయన సోమవారం కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి పట్టణంలోని వీఎంసీ కూడలి వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఓట్ల చోరీపై ఆదివారం బీహార్‌లోని ససారం నుంచి యాత్ర ప్రారంభించారని తెలిపారు. ఈ యాత్ర 18 రోజులు కొనసాగుతుందని పేర్కొన్నారు. పూడి రవికుమార్, జనార్దన్ రెడ్డి, ఈర్ల గోపి, నాగూరయ్య, సురేష్, మోహన్, బాలాజీ, వాణెమ్మ, భానమ్మ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

మృతురాలికి నివాళి



మహాలక్ష్మి అంతిమయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం జయరాం రావు వీధిలోని అయ్యప్ప జనరల్ స్టోర్ అధినేత పొట్టి చంద్రగుప్తా, పొట్టి మహేష్ గుప్తా తల్లి మహాలక్ష్మి సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అక్కడికి చేరుకున్నారు. ఆమె భౌతికదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో రాము గుప్తా, పఠాన్ ఫరీద్, సాధనమున్నా రాయల్, బుల్లెట్ జయ శ్యామ్, మధు రెడ్డి, శ్రీవారి సురేష్, కంఠా ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

పోలీసు అధికారికి సన్మానం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా కోర్టు లైజనింగ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న గోపాల్ రాజు ఏఎస్‌ఐగా పదోన్నతి పొందారు. ఈ క్రమంలో ఆయనను సోమవారం న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కుంట్రపాకు సురేంద్రబాబు ముదిరాజ్, పి.వెంకటాద్రి, కేవీ రమణయ్య, భీమేశ్వరి, జనార్దన్, కాకి చిన్న అంకయ్య, షణ్ముగం పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలపై నిరసన

వరదయ్యపాళెం: మండలంలోని కాంబాకం పంచాయతీకి చెందిన రామిరెడ్డిపాళెం గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో గిరిజనులకు ఇళ్ల స్థలాలు, ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు పంపిణీ కోసం వినతిపత్రాల ద్వారా తహసీల్దార్‌కు విన్నవించారు. అంతకుముందు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగార్జున, మురళి, సిద్దలయ్య ఉన్నారు.

అధ్వానంగా రహదారులు



గాజుల మండ్యం పారిశ్రామిక వాడలో గుంతల మయమైన రోడ్డు

రేణిగుంట: మండలంలోని రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. కరకంబాడి పంచాయతీలోని తారక రామా నగర్‌లో వీధులు నడవలేని స్థితికి చేరాయి. రేణిగుంట తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు పడి నీరు నిలవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులోనే బీసీ హాస్టల్ విద్యార్థులు పాఠశాలకు వెళ్లి రావాల్సి వస్తోంది. అలాగే రేణిగుంట - అన్నాసామిపల్లి మీదుగా వెంకటాపురం వెళ్లే రోడ్డు, శ్రీకాళహస్తి- రేణిగుంట ప్రధాన రహదారి నుంచి ఎస్‌యూ పురం మీదుగా కృష్ణాపురం వెళ్లే రోడ్లలో గుంతలు పడ్డాయి.

శంకుస్థాపన చేసి వదిలేసారు..

ఏఆర్ రోడ్డు నుంచి విప్పమానిపట్టెడ, తిరుచానూరు-పూడి రోడ్డు వరకు బీటీ రోడ్డు పునర్నిర్మాణం కోసం జూన 11న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి రూ.1.17 కోట్లతో పనులు చేపడుతున్నట్టు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. రెండు నెలలు అవుతున్నా ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు. గుంతలమయమైన రోడ్లలో ప్రయాణం సాగించలేక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పారిశ్రామికవాడలో నరకప్రాయం

రేణిగుంట మండలం గాజులమండ్యం పారిశ్రామికవాడలోని రోడ్లలో ప్రయాణం నరకప్రాయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు పెద్ద పెద్ద గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. పరిశ్రమలకు ముడి సరుకులు తీసుకుని వచ్చే భారీ వాహనాలు గుంతల్లో దిగబడి పోతున్నాయి.

అధికారుల్లో చలనం లేదు



రేణిగుంట తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు బురద మయంగా మారింది. నిత్యం అధికారులు తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. రోడ్డులో గుంతలు ఎక్కువగా ఉండడంతో తాము అనేకసార్లు మట్టి వేశాం. రోడ్డును బాగు చేయాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు.

–నరసింహారెడ్డి, స్థానికుడు రేణిగుంట



గుంతలకి మట్టి వేస్తున్న స్థానికులు





అధ్వానంగా ఉన్న తారక రామ నగర్ వీధి





గుంతల మయమైన విప్పమాని పట్టెడ రోడ్డు, రేణిగుంట తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు పరిస్థితి

పలువురికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



సుబ్రహ్మణ్యంరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సోమవారం పలువురిని పరామర్శించారు. శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యంరెడ్డి ఇటీవల మరణించారు. ఈక్రమంలో మధుసూదన్‌రెడ్డి సోమవారం వారి ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా పట్టణంలోని తెట్టు కూడలి వద్ద ఉంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు రాజా, శేఖర్ ఇటీవల ప్రమాదానికి గురై గాయపడ్డారు. వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అంజూరు తారక శ్రీనివాసులు, డాక్టర్ శివశంకర్, ప్రకాశం పంతులు, సాధనమున్నా రాయల్, బుల్లెట్ జయశ్యామ్, మధురెడ్డి వున్నారు.

దివ్యాంగుల పింఛన్ల తొలగింపు దుర్మార్గం



నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: పుట్టుకతో.. ప్రమాదరీత్యా ప్రత్యేక ప్రతిభావంతులుగా ఉంటూ పింఛన్‌పైనే ఆధారపడి జీవిస్తున్న వారి పింఛన్లను ఆంక్షల పేరిట తొలగించడం కూటమి ప్రభుత్వ దుర్మార్గపు చర్యకు పరాకాష్ట అని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆరోపించారు. పింఛన్ల తొలగింపుపై ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో కూటమి ప్రభుత్వ తీరును ఖండించారు. ఏళ్ల తరబడి వస్తున్న పింఛన్లను ఇలా తొలగించడం సరైన పద్ధతి కాదన్నారు. సదరం సర్టిఫికెట్‌లో గతంలో 80 శాతం వరకు ప్రత్యేక ప్రతిభావంతులుగా గుర్తించిన వైద్యులు నేడు అదే వ్యక్తులకు 30 నుంచి 40 శాతం మాత్రమే ఇవ్వడం కూటమి ప్రభుత్వ కుతంత్రాలకు నిదర్శనమన్నారు. అనారోగ్య సమస్యలతో కకావికలం అవుతున్న వారి పింఛన్లు తొలగించడం, వారి గోస చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి తప్పక తగులుతుందన్నారు. ఇలాంటి దుర్మార్గపు చర్యలను మానుకుని ప్రత్యేక ప్రతిభావంతులకు యథావిధిగా పింఛన్లు కొనసాగించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

స్వచ్ఛ రథం ప్రారంభం



స్వచ్ఛ రథం

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ తారక రామానగర్‌లో సోమవారం సాయంత్రం జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి స్వచ్ఛ రథాన్ని ప్రారంభించారు. స్థానికుల నుంచి వ్యర్థాలు సేకరించి బదులుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. డీపీవో మాట్లాడుతూ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా తారకరామానగర్‌లో స్వచ్ఛ రథాన్ని ప్రారంభించామని తెలిపారు. లోటుపాట్లను పరిశీలించి మంచి ఫలితాలు వచ్చిన తర్వాత మేజర్ పంచాయతీల్లోనూ స్వచ్ఛ రథాలను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయకుండా నిర్మూలించాలని ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరమ్మ, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం అధికారి షణ్ముగ రామ్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో ప్రభురావు, డీఆర్పీ కిషోర్, కార్యదర్శి రమేష్ బాబు పాల్గొన్నారు.

పంట కాలువ ఆక్రమణపై రైతుల ఆందోళన



తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పెద్దపాలేడు గ్రామ పొలాలలోని పంటలకు చెరువులోని నీటిని అందించే పంటకాలువను ఆక్రమించారని సోమవారం సుగ్గుపల్లె గ్రామ రైతులు ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ, పంట కాలువ ద్వారా 100 ఎకరాలకు చెరువు నీరు అందుతుందన్నారు. పంటకాలువను పెద్దపాలేడుకు చెందిన రైతు ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేశాడని, దీంతో పంటలకు నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీరు అందక పంటలు నష్టపోయే పరిస్థితి కలిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీదేవికి వినతి పత్రం ఇచ్చారు. తహసీల్దార్ స్పందిస్తూ, సర్వే చేయించి, పంట కాలువ ఆక్రమణను తొలగిస్తానని హామీ ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆదరిద్దాం



కూరగాయలను కొనుగోలు చేస్తున్న ఎంపీడీఓ

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రకృతి వ్యవసాయ విధానాల్లో పండించిన కూరగాయలను సోమవారం స్థానిక మండల పరిషత్, ఐకేపీ కార్యాలయాల వద్ద రైతు సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో విక్రయాలను ఎంపీడీఓ వెంకటరత్నమ్మ, ఏపీఎం మున్నెయ్య ప్రారంభించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, మండలంలోని గాజులపెళ్లూరు, ఆలత్తూరు, వీయస్‌పురం, కనమనంబేడు, గ్రామాల్లో రైతు సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో పలువురు రైతులు కూరగాయలు, వరిని ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో సాగు చేస్తున్నారని, ఇవి ఆరోగ్యకరమైన ఉత్పత్తులని చెప్పారు. దీంతోపాటు వేరుశనగ, వాణిజ్య పంటలను ప్రకతి వ్యవసాయ విధానాల్లో రైతులు పండించాలని కోరారు. ఈ విధానంలో సాగు చేస్తే రైతులకు ప్రభుత్వం రాయితీలను ఇస్తుందన్నారు. ప్రతి సోమవారం తమ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తామని, ప్రజలు దీనిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న, యూనిట్ ఇన్‌చార్జ్ జయలక్ష్మి, ఐసీఆర్‌పీ రేవతి, మునిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

దళారులకు కౌన్సెలింగ్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద ఏడుగురు దళారులకు సోమవారం శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ గోపీ మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద ఉదయం 10 గంటల సమయంలో కొంతమంది దళారులు భక్తులకు మాయమాటలు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నట్టు గుర్తించామన్నారు. వారిని స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇలాంటి సంఘటన పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించినట్టు వెల్లడించారు. అనంతరం వారిని శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి వద్దకు పంపించామన్నారు.

రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం

తొట్టంబేడు: తొట్టంబేడు పీహెచ్‌సీలో సోమవారం ఉద్యోగుల సమస్యలపై వినూత్నంగా రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీజీఈఏ తాలూకా కార్యదర్శి శ్రీనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల బాధలను పట్టించుకోవాలన్నారు. తమకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే సీపీఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. వాటిని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తాలూకా వైస్ ప్రెసిడెంట్ నీరజ, గంగయ్య, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లు కూల్చివేత దారుణం

- బాధితులకు 3 సెంట్ల స్థలం ఇవ్వాలి
- తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నేతల ధర్నా



రేణిగుంట: ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

రేణిగుంట: మండలంలోని కుర్రకాలువ పద్మానగర్‌లో పేదలు నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేయడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి తెలిపారు. ఆయన సోమవారం సీపీఐ కార్యకర్తలతో కలిసి రేణిగుంట తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ రేణిగుంట మండలంలో కొంతమంది బడా నాయకులు వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని ఆరోపించారు. వాటి గురించి రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పద్మానగర్‌లో పేదలు నిర్మించుకున్న ఇళ్లను తొలగించి వారిని నిరాశ్రయులను చేశారని దుయ్యబట్టారు. బాధితులకు మూడు సెంట్ల స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు కార్యాలయంలోకి వెళుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తహసీల్దార్ వెలుపలికి వచ్చి వినతి పత్రం స్వీకరించారు. పేదలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పెంచలయ్య, మండల కార్యదర్శి వైఎస్ మణి, కార్తీక్, సుబ్బరాజు, సెల్వ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి

ఏర్పేడు: మండలంలోని నిరుపేదలకు ఇంటి పట్టాలిచ్చి స్థలాలు చూపించాలని సీపీఐ మండల కార్యదర్శి సిహెచ్ శివకుమార్ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం పేదలతో కలిసి ఏర్పేడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణాల్లో నివసించే పేదలకు రెండు సెంట్లు, గ్రామాల్లోని వారికి మూడు సెంట్ల స్థలాలు ఇస్తామని ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మండలంలోని వికృతమాల, మర్రిమంద జగనన్న కాలనీల్లో 900 మంది పేదలు ఇళ్లు నిర్మించుకుని కాపురం ఉంటున్నారని, వారికి మౌలిక వసతులు కల్పించాలన్నారు. అనంతరం తహసీల్దార్ భార్గవికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి రమేష్, సత్యనారాయణ, గోవర్ధన్, గోపాల్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, ప్రసాద్, మునిమోహన్, సుజనా, సిద్దమ్మ, సుబ్బరత్న, లక్ష్మి, చిట్టెమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అనర్థదాయకం

బుచ్చినాయుడుకండ్రిగ: శారీరకంగా ఎదగకముందే వివాహం చేస్తే రక్తహీనత, వ్యాధి నిరోధక శక్తి లేక పలు రుగ్మతలకు గురై, కాన్పు కష్టమై, మాతా, శిశు మరణాలు సంభవించే అవకాశం ఉంటుందని మండల ఆరోగ్యధికారి వెంకటేశులు అన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై సోమవారం కల్లివెట్టు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, యువతులకు 21 ఏళ్లు, యువకులకు 25 ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేయాలన్నారు. అసిస్టెంట్ హెచ్‌ఎం సురేష్‌బాబు పాల్గొన్నారు.

తాగునీటి వసతి కల్పించాలి

సత్యవేడు: మండలంలోని పీవీపురం పంచాయతీ చమర్తికండ్రిగ గిరిజన కాలనీలో తాగునీటి ఇబ్బందులు తొలగించాలని స్థానిక గిరిజనులు సీపీఎం నాయకులతో కలసి ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ పరిధిలో తాగునీటి పైపులైన్ పాడవడంతో గిరిజన కాలనీకి తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని ఫిర్యాదు చేశారు. గత రెండు నెలలుగా తాగునీరు సక్రమంగా అందడం లేదన్నారు. నిరంతరం నీటి సరఫరా లేకపోవడంతో సమీపంలోని గుంతలోని కలుషిత నీరు తాగుతున్నామన్నారు. ఆలయ భూములు ఆక్రమణకు గురయ్యాయని తెలిపారు.

పక్కాగా జలగణన సర్వే

బుచ్చినాయుడుకండ్రిగ: పెరుగుతున్న గృహావసరాలు, పంటల సాగుతోపాటు జనాభాకు అవసరమైన నీటిని అంచనా వేసేందుకు జలగణన సర్వేను పక్కాగా చేయాలని తహసీల్దార్ శ్రీదేవి ఆదేశించారు. ఆమె సోమవారం వీఆర్‌ఓలతో మాట్లాడారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీలలో చెరువులు, కుంటలు, కాలువల్లో ప్రవహించే నీరు, భూగర్భంలోకి ఇంకి పోయే జలాలతోపాటు, గృహావసరాలకు, వ్యవసాయానికి, అందుతున్న నీటిని అంచనా వేయాలన్నారు. చెరువుల కింద రైతుల బావులు, పొలాల సర్వే నంబర్లను సేకరించాలన్నారు. ఈ నెలాఖరుకు సర్వే పూర్తి చేయాలన్నారు.

కనుల పండువగా శ్రీకృష్ణుడి కల్యాణం

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యంలో వున్న శ్రీకృష్ణ భజన మందిరంలో సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ ఇందుకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి వేదికపై కొలువుదీర్చారు. అనంతరం లక్ష్మీనారాయణ శర్మ, సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఉభయదారులుగా దీపక్ రెడ్డి, వేమూరు మోత్యశ్రీ, ఐశ్వర్య వ్యవహరించారు.

నేడు మండల సమావేశం

రేణిగుంట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభురావు తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

అన్నదాత సుఖీభవకు పేర్ల నమోదు



తహసీల్దారు భారతి

తొట్టంబేడు: అన్నదాత సుఖీభవ నగదు జమకాని రైతులు ఆయా పంచాయతీల్లోని సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ భారతి అన్నారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ భూమి ఉండి అన్నదాత సుఖీభవ అందని రైతులు పట్టాదారు పాసుపుస్తకానికి ఆధార్ లింక్ చేసుకోవాలన్నారు. అనంతరం వాటిని జిరాక్స్ తీసుకుని సచివాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. పట్టాదారు మృతి చెంది ఉంటే వారి కుటుంబ సభ్యుల పేరున మార్చుకోవడానికి అవకాశం కల్పించినట్టు తెలిపారు. తొట్టంబేడు మండలంలో 963 మందికి అన్నదాత సుఖీభవ నిధులు జమ కాలేదని వెల్లడించారు.

మా భూములు లాక్కోవద్దు



ఏర్పేడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

ఏర్పేడు: 'మేమంతా ఎకరా లోపు పొలమున్న చిన్న, సన్నకారు రైతులం.. మా భూములను లాక్కోవద్దు' అని మండలంలోని చింతలపాళెం రైతులు తెలిపారు. వారు సోమవారం సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, బాలకృష్ణ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన సర్వే నంబర్లు 10, 13, 320, 321, 322, 323లలో వున్న సుమారు 50 ఎకరాల భూమిని భూసేకరణ పేరుతో ప్రభుత్వం తీసుకునేందుకు సర్వే చేస్తోందన్నారు. తాము ఆ భూముల్లో వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నామని తెలిపారు. రెవెన్యూ అధికారులు ప్రత్యామ్నాయంగా వేరే భూములను చూసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ భార్గవికి వినతిపత్రాన్ని అందించారు. ఆమె మాట్లాడుతూ రైతుల అభ్యంతరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చింతలపాళెం సర్పంచ్ చింత బాలప్రసాద్‌యాదవ్, రైతులు పాల్గొన్నారు.